# బంధితులు

హెమింగ్వేమీద అభిమానం చాలా వున్నది నాకు. ఆయన రాసిన పుస్తకాలన్నీ చదవనూలేదు. చదివిన ఒక్క పుస్తకంలోనే ఆయనంటే ప్రాణంపెట్టే స్థితి కొచ్చేను. 'ఓల్డు మాన్ అండ్ ది సీ!'

నా పెళ్ళినాడు ఓ మిత్రుడు ఆ పుస్తకాన్ని కానుకగా యిచ్చేడు. 'తోచినప్పుడల్లా చదువుకో, మంచిపుస్తకం' అని చెప్పి రెండుముక్కలు ఇంగ్లీషులో మొదటి పేజీమీద రాసి వుంచాడు.

వయస్సు ముదిరిన బెస్తవాడు, అతనికి మనోహరమైన కొన్ని జ్ఞాపకాలు, అతనికో కుర్రనేస్తం, వాళ్ళిద్దరి స్నేహం, సముద్రం, దానిలోని సొరచేపలూ, సముద్రంమ్మీద ఎగిరే చిన్న చిన్న పిట్టలూ—వీటన్నిటితో సంబంధమైనకథ తయారయింది. రాసిన పద్ధతికి చేతులు రెండూ జోడించేయాలి.

ఆమధ్య పెళ్ళయిన కొత్తలో (ఆషాఢమాసంలో కాబోలు) ఆకథను యావత్తూ తెలుగులో రాసేను. స్నేహితులకు చూపించాను. చదివి బాగుందని మెచ్చుకున్నారు. ఆనక, అసలు పుస్తకమూ చదివేశారు.

ఆ పుస్తకాని కొక యోగ్యతాపత్ర మివ్వడం నా ఉద్దేశంకాదు. అందుకు నా స్తోమ తెంత? నాకునచ్చిన పుస్తకం గురించి పదిమందికి చెప్పుకోడం, వాళ్ళది చదివారని తెలిసినా గూడాను (నా అలవాటు.)

ఈ కథకీ ఆ పుస్తకానికీ ఏవిధమైన సంబంధమూ లేదు. కాపోతే ఆ పుస్తకాన్ని మూడో తడవ చదవటానికి ప్రారంభించిన వేళా విశేషం చెప్పుకోదగ్గది! ఒక పేజీ తిప్పేనో లేదో నా గది గుమ్మంముందు ఓ కుర్రాడు తారట్లాడుతూ కనిపించేడు.

చాలామంది కుర్రాళ్ళనింతకుముందు నే నెన్నోసార్లు చూసేను. మా అక్కయ్యకీ, అన్నయ్యకీ పిల్లలున్నారు. అవకాశం దొరికితే నెత్తినెక్కి రాజ్యంచేసేందుకు పెంకిఘటాల్లో క్లాస్ వన్ రౌడీలు! అస్తమానూ అల్లరి. అయినా ముద్దుగానే వుంటారు.

ఈకుర్రవాడి విషయం వేరు. తొమ్మిదేళ్ళ వయస్సుంటుందేమో. బొమ్మలా, అచ్చుపోసిన బంగారు బొమ్మలా మెరిసిపోతున్నాడు. తృటిలో నన్ను ఆకర్షించాడు. పుస్తకంమూసి వాడివేపు కన్నార్పకుండా చూడటం మొదలుపెట్టాను.

నా గది గుమ్మమెక్కి వీధివేపు చూస్తూ నించున్నాడు

వాడు. కాసేపలా నించుని, అకస్మాత్తుగా గంతువేయడంతో విశేషమేదో జరిగుంటుందని అనుమానించేను.

లేచి వెళ్ళి వాడి పక్కన నించుని చూసేను. గుమ్మం ముందు నిల్చిన వర్షపునీట్లో రెండు కాగితప్పడవలున్నాయి. ఓ పడవ మునిగిపోయివుంది. రెండోదానికి రాయి అడ్డు తగలడంతో ఆగిపోయి వుంది.

నేను వాడిపక్కన నించునివున్నట్లు గమనించేడు కాబోలు, తలెత్తి నావేపు చూసేడు. ఆనక గుమ్మందిగి నీళ్ళలో నించున్నాడు. తర్వాత అన్నాడు.

"మా బుజ్జిపడవ మునిగిపోయింది."

"మంచిపని జరిగింది. రెండోది నీదేమిటీ?"

తెలూపేను. వాడిమొహంలో వెలుగు తళుక్కున మెరిసింది. అప్పుడు మరింత ముచ్చటగా కనిపించేడు.

కాసేపటికి వాడి పడవ రాయిని తప్పించుకొనిముందుకు సాగింది. కదుల్తోన్న పడవని చూస్తున్నాడు.

"నీ పేరేమిటోయ్?"

"పార్థు" స్పష్టంగా చెప్పాడు.

"పడవలు చేయటం నీకు బాగా చాతొచ్చేమిటి?"

"..."

"ఏం చదువుతున్నావ్?"

"నాలుగు"

వాడి పడవ దూరంగా వెళ్ళింది. పారుడు జారిపోతున్న తననిక్కర్ని పైకి లాక్కుంటూ ఆ పడవని వెంబ

డించాడు, అప్పుడక్కడ వాడితో పాటు నాకూ ఆడుకోవాలని పించింది. గది తలుపువేసి గుమ్మం దిగేసన్నమాటేగాని మరో అడుగు ముందుకు వేయలేక పోయేను.

సరిగ్గా నాగది ముందు ఓ డాబా వున్నది. ఆ డాబా మీద ఓ ఆడకూతురు తీరిక చేసుకుని పార్థుడివైపు కుతూహలంగా చూస్తోంది. నన్ను చూచిగూడా ఆమె అక్కణ్ణుంచి కదల్లేదు. నా పెద్దరికం చప్పున గుర్తుకు రావడంతో మళ్ళీ వెంటనే గదిలోకి వొచ్చేసి తలుపు వేసేను.

ఈ వూరికి ప్రత్యేకమైన ఆఫీసు పనిమీద వొచ్చేను. మూడునెలలపాటు నేనీవూళ్ళో వుండాలి. మా వాళ్ళందరిని వొదిలేసి నేనొక్కణ్ణే ఆక్కడి కొచ్చేసేను. ఈగది కుదుర్చుకోడం చాలా సులభంగా జరిగిపోయింది. అన్ని సదుపాయాలూ వున్నాయి. మంచి పొరుగు. ఈవూరొచ్చిన పది రోజుల్లో రాసిన అయిదు త్తరాల్లో శ్రీమతికీ విషయాలన్నీ రాసేను. శ్రీమతి నుంచి ఆవాళ వొచ్చిన జాబులో నే తీసుకున్న గది తాలూకు సదుపాయాల గురించి రాయమని రాసింది. ఏమిటో ఖంగారు మనిషి.

నాకు గదినిచ్చిన శ్రీధరరావుగారు బడిపంతులు. ఇంటి దగ్గర 'ప్రైవేట్లు' ఏర్పాటు గొడవున్నది. కేవలం ఆయన స్వార్జితంతోనే లంకంత యిల్లు కట్టేశాడు. ఆయన ముందు చూపున్న మనిషనీ, రెండో పెళ్ళితో సుఖంగా వున్నాడనీ టూకీగా ఆయనగురించి తెలిసిన వివరాలు.

ఇంట్లో మొత్తం ఎంత మంది జనాభా వున్నారో తెలీదు. చాలా నిశ్శబ్దంగా వుంటుంది ఇల్లు. అప్పుడప్పుడూ సాధూ, బాబ్జీల సందడి మినహాయిస్తే మరేయితరుల గొంతూ సాధారణంగా వినిపించదు.

ఓ రోజు బాగా పొద్దుపోయింతర్వాత గదికొచ్చేను. మనసంతా ఇబ్బందిగా వుండటం చేత త్వరగా నిద్ర పట్టింది కాదు. ఏమైనా చదివేందుకు మనసొప్పలేదు. లైటు ఆర్పి సిగరెట్టు ముట్టించేను. నోరు చేదుగా తయారయ్యేంతవరకూ సిగరెట్లు కాల్చేను. రాత్రి పది దాటిం దనుకుంటాను. పక్క వాటాలో సాధుడేదో గొణుగుతున్నాడు. ఎవరో సముదాయిస్తున్నారు. కాసేపటికి సాధుడు పాట పాడమని అడిగేడు. ఆవిడ పాడింది.

గోపాల కృష్ణుడు నల్లన
గోకులములో పాలు తెల్లన
కాళిందిలో నీళ్ళు చల్లన
పాటపాడవే నాగుండె ఝల్లన...

పాటవింటూనే, నాకెప్పుడో పరిచయమైన గొంతుని గమనించి ఉలిక్కిపడి లేచి కూర్చున్నాను. ఓ సుందరమైన రూపాన్ని ఊహించాను. అంతలోనే కాదని సరిపెట్టుకున్నాను, మళ్ళా అవుననిపించింది.

లైటు వేశాను ఉన్నపళంగా ఆ పాట పాడుతున్నావిడను చూడాలనుకున్నాను. సభ్యత స్ఫురణకొచ్చి ఆ ప్రయత్నం మానుకొన్నాను. పాట ఆగిపోయినా, నా మనసులో సి బొమ్మ చెరిగిపోలేదు.

ఉదయం పార్థుడ్ని కదిపి విషయం తెలుసుకుందామనుకున్నాను. స్నానం ముగించి అద్దం ముందు నించున్న వేళ పార్థుడు సంచి వూపుకుంటూ మరో ఇద్దరి నేస్తాల్తో స్కూలుకి వెళ్ళబోతున్నాడు. గబగబా గుమ్మం దగ్గర కొచ్చేశాను. పార్థుడ్ని పిలిచేందుకు నోటిదాకా వొచ్చిన మాటని, నాంగది గుమ్మం ముందున్న డాబా అమ్మాయిని చూసి దాచేసుకున్నాను లోపలికొచ్చి కూర్చున్నాను.

ఆ క్షణంలో డాబా వారి అమ్మాయి మీద కోపం చాలా వొచ్చింది. ఆవిడకి మరేం పని లేనట్టు డాబా మీద అస్తమానం ఆ విహారాలేమిటి? కళ్ళింతవి చేసుకుని నేలమీద బతుకుతూన్న మమ్మల్ని చీమల్తో పోల్చి చూడట మేమిటి? నాన్ సెన్స్.

ఆఫీసు కెళ్ళేంత వరకూ పాట పాడినావిడ కోసము ఎదురు చూసేను. ఏ పనిమీదైనా తిరుగుతూ ఆవిడ నాకు కనిపిస్తుందేమోనని. కనిపించలేదు. గడిచిన కొద్ది రోజుల్లో ఆమె నాక్కనిపించే వుంటుందిగానీ, ఎప్పుడూ ఈ పాట పాడకపోవడాన నేనావిడ్ని అంత శ్రద్ధగా చూసి ఉండను.

సాయంత్రం ఆఫీసునుంచి తిరిగి రాగానే తిన్నగా కిటికీ దగ్గర కుర్చీ వేసుక్కూర్చున్నాను.

కొన్నేళ్ళక్రితం నేనో తెలుగు సినీమా చూసేను. ఆ సినీమాలో వో పాట విని ముగ్ధుడినయ్యేను. తర్వాత అదే పాట అనేకమంది పాడుతూండగా విన్నానుగానీ అప్పుడు నేనంత ఆనందించలేదు.

నేను కాలేజీలో చేరిన కొత్తరోజుల్లో సుందరశివరావు వాళ్ళ మామిడితోటలో అదేపాటని వినడం జరిగింది. నిజం చెప్పాలంటే ఆ సినీమాచూస్తూ ఆ పాట విన్నప్పుడు కూడా నేనంతగా చలించలేదేమో. పాట పూర్తయింతర్వాత నా కను కొలకులో నీళ్ళు నిలవడం గమనించి మా సత్యాం మెల్లిగా అన్నాడు—

"ఈమాత్రం దానికే ఏడుస్తావేం రా, ఫూల్!"

నిజానికి నేను ఫూల్ నేమో! సినీమాచూస్తూ — శ్రీరాముల వేషధారికి నమస్కారం చేసేయగల పిచ్చివాడిని. వేదిక ఎక్కి లంకేశ్వరుడి దవడ పగల గొట్టేయగల పిచ్చివాడిని.

"మా ముద్దుకృష్ణయ్య లీలలు
మంజుల మధు మురళీ లీలలు
మా కేరిసారి కల గోలలు
మాకు ఆనందవారధి వోలలు!"

ఆనాడు అనుకున్నాను సుందరశివరావు అదృష్టవంతుడని. అపర సరస్వతీదేవి సత్యవతి మనసుని గెలుచుకున్నాడు: సత్యవతినీ, సుందరశివరావునీ ఆనాడే చూసేను, సత్యవతి కమ్మని కంఠం తేనెలొలకగా, ఆ మధురానుభూతిని ఈ గుండెల్లో దాచుకున్న భాగ్యం ఆనాడే కలిగింది.

మా కాలేజీ ప్రెసిడెంట్ గిరికి సుందర శివరావు పోటీ చేసి హెచ్చు మెజారిటీతో ఎన్నికయ్యేడు. ఆ శుభ సంద

ర్భాన్ని పురస్కరించుకొని అతని మిత్రులందరికీ పార్టీ ఇచ్చేడు. ఆ సాయంత్రం వాళ్ళ మామిడి తోటలో భారీ ఎత్తున ఏర్పాటుచేసిన ఆ పార్టీకి మా సత్యం వెంట నేనూ వెళ్ళేను.

సుందర శివరావుతో నా కేవిధమైన పరిచయమూ లేదు, వాళ్ళ వర్గంలో నాకెవ్వరూ తెలీదు. సత్యం మా మేనబావ. వాడు సుందరశివరావు, సత్యవతుల క్లాసుమేటు. వాళ్ళందరూ మంచి స్నేహితులు.

నేను సత్యంతో తిరగడం మూలంగా ఆనాటి పార్టీకి నేనూ వెళ్ళవలసి వచ్చింది. పైగా — నా ఓటు సుందరశివ రావుకే వేశాను.

సుందరశివరావు ఏర్పాటుచేసిన పార్టీ తాలూకు పూర్తి వివరాలు సరిగ్గా జ్ఞాపకంలేవుగానీ, మనసుకి నచ్చిన ముచ్చటైనసన్నివేశాలు కొన్ని యిక్కడ ఎత్తిరాస్తాను.

పార్టీ జరుగుతున్నప్పుడు సుందరశివరావు సత్యవతిని తన సరసన నిలబెట్టుకుని ఇంగ్లీషులో ఉపన్యాసం చెప్పేడు. వాళ్ళిద్దరూ కలిసి ప్రేమించుకున్నట్టు, త్వరలో వాళ్ళ పెళ్ళి జరగబోతున్నట్టూనూ. అప్పుడు సత్యవతి మొహంలో సిగ్గులు మొగ్గలు తొడిగింది. పెద్దకళ్ళని సగానికి మూసి, హాయిగా నవ్వింది. చాలు—ఆనవ్వు నాకిప్పటికీ గుర్తు! ఒక మనిషికి అన్నీ అందుబాటులో ఉన్నప్పుడు కులాసాగా నవ్వితే ఆనవ్వు అలాగే వుండి తీరుతుంది.

సత్యవతి నవ్వేసి తలదించుకుంటూన్న సమయంలో నా పక్కన కూర్చున్న సత్యం 'వన్సమోర్ ప్లీజ్!' అన్నాడు.

సుందరశివరామయ్య అంతకుముందు చెప్పిన నాలుగు మాటల్నే మళ్ళా చెప్పేడు పాపం!

నాకు తెలుసు — మా సత్యం వన్స్‌మోర్ అభ్యర్థన సుందర శివరామయ్యయొక్క అమోఘమైన ఉపన్యాస శిల్పానిక్కాదు, సత్యవతి అందమైన నవ్వు నుద్దేశించి. సుందర శివరావు ఆ తర్వాత చాలా చెప్పేడు. అద్దే మామిడి తోటలో మేమందరం మెచ్చుకునే రీతిలో ఓ సుందరమైన తాజ్‌మహాల్ కట్టించే ఉద్దేశముందనీ, దాన్లో వాళ్ళిద్దరే కాపురముంటారని చెప్పేడు.

అతని ఊహాగానం విని అసూయ చెందినవాడినేన్నేను. ఆ 'నేను'కి ప్రేమించటం తెలీదు. అథవా ప్రేమించినా, సుందర శివరావు కట్టించబోయే తాజమహాలు మాటల్లో సైతం చెప్పుకోగల తాహతు ఆ రోజుల్లో లేదు. అందుచేతనే సుందర శివరావు బంగారు జీవితమ్మీద జెలసీ చెందేను.

పార్టీ ముగిసింతర్వాత కాబోయే అర్థాంగిచాత పాట పాడించేడు.

ఇళ్ళకి వెళ్ళబోయేముందనుకుంటాను, అందర్తోపాటు లేచి నించున్న సుందర శివరావు గబుక్కున కూర్చున్నాడు. మామిడి చెట్టుకి నడుం ఆనించి సత్యవతివేపు అమాయకంగా చూసేడు. అందరం ఖంగారు పడిపోయేము. అప్పుడు తెలిసింది. అన్నీవున్న మనిషికి, అన్నీ ఉన్నాయనే విషయం గుర్తొచ్చి, గుండెల్లో పోటు రావడమనేది ఒక రకమైన వ్యాధి

'అతి' ని భరించలేని నాజూకుతనంగల మనిషి సుందర శివ రావు.

సత్యవతి కొంచెం సేపతనికి ఉపచారంలాంటిదేదో చేసింది. అతని గుండెలమీద సున్నితంగా ఆమె చేతిని రాసింది. ఒక్కొక్క అందమైన చేతికి వైద్యరీత్యా విలువెంతో నాకు ఆనాడే తెలిసింది. అలాంటి ఆడపిల్ల సన్నిధిలో మరణమే కలిగినా అదీ ఒక గొప్ప అదృష్టంగానే భావించవచ్చు. మరేం ఫరవాదు. వెధవ బ్రతుకు—నీరసంగా రసహీనంగా ఎన్నాళ్ళు బ్రతికితే మాత్రం ఏం ప్రయోజనం గనక?

కాసేపటికి సుందర శివరావు లేచి నించుని పెదాల మీదుగా నవ్వేసి అన్నాడు.

"ఐయాం ఆల్‌రైట్ మైడియర్ ఫ్రండ్స్ థేంక్యూ సత్యా! థేంక్యూ వెరీ మచ్."

ఆ రోజుల్లో సుందర శివరావులా తిరుగుదామనిపించేది నాకు. అతనిలా సిగరెట్లు కాల్చేస్తూ, అతనిలా తెలివిగా (అందంగా) మాట్లాడుతూ, అతనిలా సరదాగా— ఎన్నో కోరికలు! కానీ, అదేం పాపమో! ఆ పార్టీ ముగిసిన మరుసటి రోజునుంచే అతను నన్ను చూచి గూడా పలుకరించేవాడు కాదు. అక్కడికీ రెండు మూడు తడవలు అతన్ని పలుకరించి నా అభిమానం చంపుకున్నానేగానీ, అతన్నేననుకున్నంత 'చొరవ' గల మనిషికాడు. ఏ పుట్టినరోజు పండుగలాంటిదో నేనూ ఏర్పాటుచేసి సుందర శివరావునీ, అతని ప్రేమనీ,

అతనిసొసైటీని యావన్మందినీ పిలిచేసి ఇంకేదో చేసేయాలని పించేది. కానీ, అతనీ చుట్టూతావున్న 'హంగు'ని చూచి ఆ కోరిక చంపుకునే వాడిని.

—నన్ను కొన్నాళ్ళపాటు 'ఆలోచింప' జేసిన 'ఆ సుందర శివరావు భార్యేనా యీామె? లేకపోతే— అదే పాటని నామనసుకి నచ్చే రీతిని అంత చక్కగానూ ఎలా పాడ గలదు? ఎలా పాడుతుం దసలు?

నే నీ గదిలోచేరి యిన్ని రోజులైనా, ఒక్క రోజు గూడా సుందర శివరావు కన్పించలేదు. శ్రీధరరావుగారికీ, నే నూహిస్తున్న ఈ సత్యవతికీ సంబంధమేమిటో తెలీదు. వోవేళ పరిస్థితులు అనుకూలించక సుందర శివరావు సత్యవతిని పెళ్లాడ లేకపోయేడా? ఏమో— అదీ జరిగుండవచ్చు. ఈ ప్రేమ కథలు ఒక్కోమాటు బలీయమై పోగలవు.

దొడ్లో అలికిడైనట్టు గమనించేను. కిటికీ గుండా ఆత్రంగా చూసేను. మెరపుతీగలాటిపడుచు తెల్లని బట్టల్లో మరింత మెరిసిపోతోంది. సన్నజాజులు అతి నాజూగ్గా కోసు కొంటోంది. నూటికి నూరుపాళ్ళు సత్యవతే! నమ్మకంగా సాక్షాత్తు ఆవిడే!

అకస్మాత్తుగా ఆమె నా కిటికీవేపు చూసింది. గబిక్కన అక్కడ్నించి లేచివొచ్చి హాల్లొాలుమీాద కూచ్చున్నాను. సుందర శివరావు గుర్తుకొచ్చేడు. అంతగా ప్రేమించిన అతను సత్యవతి నెందుకు పెళ్ళి చేసుకోలేదు?

సత్యవతితో ఉత్తర ప్రత్యుత్తరాలునాకు అంతగా లేవు.

అతను నాగార్జునసాగర్‌లో పనిచేస్తున్నాడు. వెంటనే అతనికో ఉత్తరం రాశాను.

"... ఈ విషయంలో కుతూహలం పొరపాటుకాదేమో సత్యం! నా మనసుకునచ్చిన మనుష్యుల్లో వాళ్ళిద్దరూ వున్నారు గనక యింతగా రాయడమవుతోంది. నిజమే. నీతో తిరిగినన్నాళ్ళూ వాళ్ళవిషయం ముచ్చటించలేదు. అంతమాత్రం చేత నేనువాళ్ళని మరిచిపోయేనని అనుకోవద్దు.

రాత్రి నాకునచ్చిన పాటవిన్నాను. అదేపాటని కొన్నేళ్ళక్రితం నీతోపాటు సుందర శివరావు పార్టీకొచ్చినప్పుడు విన్నాను. ఆనాడు నా పరవశత్వాన్ని మందలించావు గూడాను. కానీ సత్యం —ఆపాటంటె నా కెంతోయిష్టము. నే నిప్పుడిక్కడ కవిత్వమేదో రాయబోతున్నానని ఖంగారు పడకు. నీ అభిరుచి నాకు తెలుసు. నీతో అడ్జెస్టు కావడమూ తెలుసు.

సత్యవతి ఆ పాటపాడింది. మీ సుందరశివరావు ఆ రోజుల్లో ఆ పిల్లనితప్ప మరెవ్వరినీ పెళ్ళిచేసుకోనని మనందరికీ చెప్పేడు. బహుశ నీ కిది గుర్తుంటుందనుకుంటాను. రాత్రి అదేపాట వినిపించగానే సత్యవతి జ్ఞాపకమొచ్చింది. ఆతర్వాత నే నిక్కడ సత్యవతిని చూసేను ఇన్నిరోజులైంది. ఇప్పటికొచ్చి సుందరశివరావు నాకీ యింట్లో కనుపించలేదు. కారణం చెప్పలేనుగానీ, సుందరశివరావు మాటతప్పి మరో పిల్లనెవర్నైనా పెళ్ళాడాడేమోనని పిస్తుంది. ఇది కేవలం ఒక అనుమానం.

నీకు వాళ్ళిద్దరివిషయమేదైనా తెలుస్తే వెంటనేజవాబు వ్రాయి. ఏంతోచక రాసిన ఉత్తరమని కొట్టిపారేయకు. నీ జాబుకోసం ఎదురుచూస్తుంటాను..."

ఉత్తరాన్ని పూర్తిచేసి, ఆ వేళే పోస్టుచేయడానికి బయటకువెళ్ళేను. పోస్టుచేసి తిరిగి గదికొస్తుండగా, నా గది ముందు పార్థూ, బుజ్జీ యిద్దరూ కర్రల్తో కత్తియుద్ధం చేస్తూ న్నారు. వాళ్ళనిచూస్తూ అక్కడే నించుండిపోయేను.

రాను రాను ఆ యుద్ధం మంచి రక్తిగా తయారవు తోంది. పార్థుడు చాలా తమాషాగా కర్రతిప్పేస్తున్నాడు. బుజ్జి దొంగదెబ్బ తీసేందుకు ఎదురుచూస్తున్నట్టుంది. వాడ ప్పుడే బిక్కమొహంపెట్టి దొంగచూపులు చూస్తున్నాడు రాస్కెల్!

తృటిలో పార్థుడి కాలిమీద బుజ్జిగాడు కొట్టేవాడేను. వెంటనే వాళ్ళిద్దరి మధ్యకీవెళ్ళి, బుజ్జిప్రయత్నాన్ని వారించి, న్యాయంగా పోరాడమని హెచ్చరించేను. పార్థుడు ఉత్సా హంగా తలూపేడు. గానీ, బుజ్జిమాత్రం నావేపు మిర్రున చూసేడు.

డాబా తాలూకు పనిలేని ఆడకూతురు మరో మగ రాజుల్తో క్రింద ఈ ధర్మయుద్ధాన్ని చాలా యిదగా చూస్తూ న్నట్టు గమనించి గబగబా నా గదిలోకి ఒచ్చేను.

బయట మళ్ళా యుద్ధం ప్రారంభమయింది. ఈ తడవ కొంచెంజోరుగాసాగుతోంది. యుద్ధంసినీమాల్లోలాగా పార్థుడు

తన మెడంచేతిని ఎత్తిపట్టి కుడిచేత్తో కర్రని మహా సరదాగా తిప్పేస్తూన్నాడు.

సరిగ్గా అదే సమయంలో ఓ లావుపాటి ఆడమనిషి అక్కడికొచ్చింది. సాగుతూన్నయుద్ధం టక్కున ఆగిపోయింది. అక్కడ్నుంచి ఆవిడ గొంతుచించుకోడం మొదలైంది.

"అయ్యో, అయ్యో, నీ కళ్ళు నెత్తిమీద కొచ్చె యట్రా పారూ! నీ చేతులు విరిగిపోనూ—చిన్న వెధవన్చేసి నీ యిష్టమొచ్చినట్టు కొట్టేస్తూన్నావుట్రా! నిన్నని ఏంప్రయో జనం, చెట్టంతఎదిగి ఈ అఘాయిత్యాన్ని చూస్తున్న వాళ్ళ ననాలి. కడుపుకి కంటే తెలుస్తుందికానీ, ఎంత మొత్తుకుంటే ఏం ప్రయోజనం?...నీ కెన్నిసార్లు చెప్పాలిరా మడ్డి వెధవా, ఈ రౌడీ ఆటలాడొద్దని. ఇంకా యిక్కడే నించున్నావేరా? కదులు" అన్చెప్పి బుజ్జిచెవిపుచ్చుకు బరబరా లాక్కుపోయిం దావిడ.

పార్థుడు బిక్కమొహంతో, నేలమీద కాలతో రాస్తూ నించున్నాడు.

డాబామీదున్న ఆవిడ, అతన్తోసహా—తుపాకిగుండు తగిలిన పిట్టల్లా రివ్వున డాబా దిగేశారు.

"కడుపుకంటే తెలుస్తుంది గానీ—"

నాకూ బాధనిపించింది. ఎలాగైతేనేం ఈ భూమ్మీద ఈవి డొక్కర్తే కనిపారేస్తున్నారు కాబోలు బిడ్డల్ని! పిల్ల లిద్దరూ ముచ్చటగా ఆడుకుంటున్నారని చూడ్డంగానీ, మాకు

పిల్లల్లేరని కాదుగా. ఆ డాబావాళ్ళ సంగతేమిటో తెలీదు గానీ, కొన్నిరోజుల్లో నేనూ తండ్రిని కాబోతున్నాను.

"అమ్మా! తల్లీ! నువ్వేమో ఆ గదిదాటి ఒక్కడుగు ఇటురావు. మీ పార్థుడేమో ఇక్కడ పసిపిల్లవాడ్నిష్టమొచ్చినట్టు కొట్టిపారేస్తూన్నాడు. అదేమంటే మిడిగుడ్లు పెట్టుకు మింగేస్తున్నాడు. రా! వచ్చి వాడిఅవతారాన్ని చూడు. ఏ గాలికి బతుకుతే మాకేమన్నట్టు కూర్చుంటే నష్టమెవ్వరికి?"

ఆవిడింకా అరుస్తూనే వున్నది.

రాత్రి పక్కవాటాలోంచి మెల్లిగా మాటలు వినిపించేయి. పార్థుడికి బుద్ధిచెబుతోంది సత్యవతి.

"అల్లరిగా తిరక్కూడదు నువ్వు. బాగా చదువుకోవాలి. పదిమందిలోనూ మంచి అనిపించుకోవాలి. నువ్వు నా మాట వినకపోతే నా కేడుపొస్తుంది పారూ చెప్పు ... అమ్మ యేడుస్తే నీకు బాగుంటుందా?"

వెంటనే శ్రీమతి గుర్తుకొచ్చింది నాకు. ఆ మధ్య వారం రోజులుపాటు విపరీతమైన దగ్గుతో బాధపడిపోయేను. అది కేవలం సిగరెట్లు అతిగా కాల్చడం వలనని మా ఆవిడ నింద! రెండురోజులు చెప్పిచూచింది. ఆ రెండురోజులూ కావాలని చెప్పి మరింత ఎక్కువగా కాల్చాను. అప్పుడన్నది, కళ్ళనిండా నీళ్లు నింపుకుని;

"కనీసం నా ముందైనా సిగరెట్లు కాల్చకండి. మీ దగ్గు చూస్తూంటే భయమేస్తోంది. దానిక్కారణాన్ని పదే పదే గుర్తుచేసి నన్ను బాధపెట్టకండి. నేను బాధపడటం మీ కిష్టమైతే మరి నేనేం చెప్పలేనంతె!"

శ్రీమతి గుర్తుకు రావడంతో సిగరెట్టు కాల్చాలనిపించింది. సిగరెట్టు ముట్టించి పొగ వదలేను. ఇక్కడొక మాట మనవి చేయాలి. నేను కలల్లో కొంచెం సరదాగా తిరిగేమనిషిని. ఈ అలవాటిప్పటిదికాదు. చాలా మంది నన్నీ విషయంలో ఎగతాళి చేసేవారు కూడాను.

"అతనా! వట్టి తిక్కమనిషి. మనం చెప్పేది వింటూనే మనల్ని మరిచిపోయి తిక్కపోజు పెట్టేసి వెళ్ళిపోతాడా" వటాని! తోచని సమయాన్ని తోచేవిధంగా మల్చుకోడమనే పద్ధతిని 'తిక్క' అంటే నేనేం చేసేది?

కొన్నిరోజుల్లో పుట్టబోయే మా చిరంజీవి వయస్సు ఈ క్షణంలో నాలుగేళ్ళు. చందమామ. మా యింటికో వెలుగు. అవునాండి, ఇది మొదటిభాగం. వాడు త్త పెంకిఘటం. వాళ్ళమ్మని క్షణం ఊపిరి పీల్చుకోనివ్వడు. వాళ్ళమ్మ దగ్గిర వాడికి చనువెక్కువ. ఇరవైనాలుగ్గంటలూ మాటలు కావాలి. ముచ్చటపడి యేదైనా వాడితో చెప్పడానికి ప్రయత్నిస్తే యక్షప్రశ్నలు. ప్రాణంతీసి పారేస్తాను. ఈ పోరుపడలేక శ్రీమతి వాడిని నా దగ్గరికి పంపించి ఓనాడు. అప్పుడు మా యిద్దరి మధ్య నడిచిన సంభాషణా క్రమం యిది:

"ఒరేయ్ ఏమిట్రా అల్లరి?" నేను.

"అల్లరికాదు గురూ!" వాడు.

"ఒరేయ్, ఒరేయ్! నాన్నగార్ని 'గురూ' అనకూడదు."

"మరి నువ్వు ఆ కళ్ళజోడునూ వయ్యాని గురూ అంటావేం?"

"వాడా? వాడు వెధవ గనక."

"గురూ అంటే ఏమిటి?"

"ఇదిగో విన్నావా? ఏ డిక్కడ నన్ను తినేస్తున్నాడు."

"నాకేం తెలీదు" మా ఆవిడ.

"మరి... ఒక్కోమాటు నువ్వూ, కళ్ళజోడు మావయ్యా యిద్దరూ కలిసి యెవర్నో తిడతారెందుకూ వాడు వెధవ కాడా?"

"నీతో నేను వాగలేను రా చిట్టీ! మాటకుముందు నన్ను నువ్వు అని పిలవకు."

"ఏమని పిలవాలి?"

"డాడీ! అని"

"ఎందుకని."

"నువ్వు మా అబ్బాయివి గనక,"

"పిలవకపోతే."

"కొడతాను."

"ఎందుకని."

"అబ్బబ్బ... చంపేస్తున్నావురా చిట్టిగా."

"నాకివాళ డబ్బు లివ్వలేదు. అమ్మ నడిగితే తం దగ్గ ర్లేవంది."

"ఇప్పుడు డబ్బుల్తో పనేమిట్రా?"

"కొనుక్కోవాలి."

"ఏమిటి?"

"సిగరెట్టులు."

కథా నిలయం
15991
శ్రీకాకుళం



"అయ్యబాబోయ్! నిన్ను సిగరెట్లు కాల్చమని ఎవరు చెప్పార్రా?

"అమ్మ."

"విన్నావా? వీడిని సిగరెట్లు కాల్చమని సలహా యిచ్చావా?"

*    *    *    *

"వాడిని చూచైనా ఆ పాడు సిగరెట్లు మానేయండి" మా ఆవిడ పథకం ఇది.

"సర్లే. నువ్వు నోరుమూసుకో. చూడు చిట్టీ నువ్వు సిగరెట్లు కాల్చకూడదు నాన్నా! తప్పు."

"మరి నువ్వు కాల్చుకోవచ్చా?"

"నేను పెద్దవాడిని."

"మరి నేను పెద్దయింతర్వాత కాల్చనా?"

—సిగరెట్టు చివరంటాకాలీ, వేలిని కాల్చేసింది. దాంతో కలనుంచి బయటపడ్డాను. ఛీ... వెధవది, సిగరెట్లు మానేయాలి. ఈ దురలవాటు పిల్లలక్కూడా సంక్రమిస్తే అప్పుడేంగావాలికనుక?

మావాడు పార్థుడిలా కొంచెం అల్లరి. కొంచెం బుద్ధిగావుంటేచాలు. మా అక్కయ్య వాళ్ళు నాకు ఆడపిల్ల పుడుతుందని జోస్యం చెపుతున్నారు. వాళ్ళదంతా స్వార్థం మాపిల్లకి పెళ్ళిచేసే ప్రయత్నంలో వాళ్ళతో కాళ్ళబేరానికి రావాలని వాళ్ల ఉద్దేశం. మా అమ్మగూడా వాళ్లజట్టే. ఎటుతిరిగీ అన్నయ్యా, నాన్నగారూ, నేనూ, మా ఆవిడ,

అందర్నీ మించి మా వదిన—మా అందరికోరికా నాకు కొడుకు కావాలనే.

నిద్రకి కళ్లు మూతలు పడుతూన్న వేళ మా వాళ్ళంతా గుర్తుకొచ్చేరు. ఆ రాత్రి కలల్లోనే గడిపాను.

ఆఫీసుకెళ్ళడం, అద్దెగదికి రావడం మినహా వేరే వ్యాపకమంటూ లేదు. చాలా యాంత్రికంగా ఉన్నదిక్కడ నా వ్యవహారం. సాయంత్రం ఈవూళ్లో మొట్టమొదటిసారిగా సినిమాకెళ్ళాను. మావూళ్ళో చూడటం పడని ఇంగ్లీషు సినిమా 'నార్త్ బై నార్త్ వెస్ట్' ఇంటర్వెల్లో ఇక్కడ ఆఫీసులో పనిచేసే మోహన్ రావ్ కలిశాడు. మోహన్ రావెంట కొత్తమనిషి ఒకతనున్నాడు. పరిచయం చేశాడు. శర్మట. మొన్నమధ్య ఒకకథ పత్రికలో రాశాట్ట. నేను చదవలేదు గానీ ఆకథ చాలా బాగుందని మోహన్ రావ్ మెచ్చుకున్నాడు. శర్మ మాయిద్దరికీ టీలు తెచ్చాడు.

సినిమా పూర్తయింతర్వాత మోహనరావొక్కడూ నాతోపాటు సెంటర్ వరకూ వచ్చేడు. దారిలో అతినన్నాడు.

"ఈ శర్మ మీ యింటివోనరుగురించే ఆ కథ రాసేడు. దానిమీద కొన్ని గొడవలూ వచ్చాయి."

"మా యింటివోనరుకి ఒక కథకూడా ఉన్నదా".

"ఆహా. మొదటిపెళ్ళాముండగానే రెండోపెళ్ళాన్ని కట్టుకున్న ఘనుడు, మీరాపని చేయగలరా ?"

"నే చేయకపోయినా చాలామంది చాటుగా చేస్తున్నట్టు తెలుసు."

"ఇందులో తిరకాసూ ఏర్పడిందిలెండి. మొదటిపెళ్ళా నికి పిచ్చెత్తిందని ఒక గొప్ప పుకారు పుట్టించి రెండో పెళ్ళాన్ని పట్లిగ్గా పెళ్ళాడాడు. మొదటిపెళ్ళాం నిజంగా తనకి పిచ్చెత్తింది కాబోలునని చెప్పి నూతిలో దూకి చచ్చింది."

"నాకీ విషయాలు తెలియవుసుమా?"

"శ్రీధరరావు డబ్బుకోసం ఎంతపనైనా చేసేయగల పురుగు. ఉత్త మాయమనిషి. కొన్నాళ్ళకి మీకూ తెలుస్తుందిలెండి,"

మోహనరావు వెళ్ళిపోయాడు. శ్రీధరరావుగురించి ఆలోచనలుమాత్రం నన్ను విడిచిపెట్టలేదు. కాని వూరొచ్చింది ఆఫీసుపనిమీద. ఆపనేదో చక్కబెట్టుకు వెళ్ళవలసిన వాడిని అనవసరంగా శ్రీధరరావుగురించి నాకిన్ని ఆలోచన లెందుకు ? అని చాలాతడవ లనుకున్నానుగానీ, ఆచరణలో ఓడిపోయాను. సత్యం అన్నట్టు నేను 'ఫూల్' నేమో !

సత్యందగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది. క్షేమసమాచారం వగైరా మినహాయించి ఆ ఉత్తరంలో నాక్కావలసిన విషయాలు యివి.

"...ఇక్కడ నీకోకథ చెప్తాను. దాన్ని నీగుండెల్లో దాచేసుకో. నేను సత్యవతిని ప్రేమించానని చెబుతే నమ్మవేమోగాని నేను ప్రేమించినమాట నిజం. అయితే ఆ సత్యవతికి డబ్బుకావాలి. హోదాగల ఒక మొగుడు కావాలి,

సత్యవతిని చదివించింది సుందర శివరావు. అందుచేత విధవయ్యింది. సుందరశివరావుకి గుండెజబ్బుంది. నాలుగేళ్ళ

క్రితం సుందరశివరావుని ఆ జబ్బు మింగేసింది: మొన్నీ మధ్యనే సత్యవతి పుట్టింటికెళ్ళిపోయిందని తెలిసింది. వెళ్ళే ప్పుడు అత్తవారింట చిన్నసైజుయుద్ధం చేసిందట, అయ్యో! ఇదీ కథ.

సత్యవతికి పెళ్ళయ్యేంతవరకూ నా ప్రేమని దాచు కున్నాగా రావ్! ఆమె మొగుడు పోయింతర్వాత ఆమెనే మరిచిపోయాను. నీ ఉత్తరం నాకు చాలా గుర్తుచేస్తోంది. అందుచేత చదివి దాన్ని చించవతల పారేశాను. ఇకముందు సత్యవతి విషయమై నువ్వు నాకు ఉత్తరాలు రాయకు. ఇది నా రిక్వెస్టు, సత్యం."

సాయంత్రం గదికి వెళ్ళగానే పార్థుని చూశాను. కావాలనిచెప్పి నాగదిలోకి పిలిచాను. రెండు చాకలెట్లు వాడిచేతిలో పెట్టాను. వాటిని దూరంగావుంచి అన్నాడు.

"తప్పు, నేను తినకూడదు. అమ్మ పిన్ని తిడుతుంది."

"ఎందుకనిట?"

"మీారిచ్చిందేమీా తినగూడదు."

"ఫర్లేదు తిను. మీా అమ్మ పిన్నికి నేను చెబ్తాగాని తిను."

భయంగా తీసుకున్నాడు.

"మీా అమ్మగారి పేరేమిటోయ్?"

"సత్యవతమ్మ"

"మరి మీా నాన్నగారిపేరు?"

"లేరుగా."

"పేరేమిటి?"

"సుందరంగారు చాలా మంచివాడు. మా చిన్నాన్నా మంచివాడే. అమ్మపిన్నికి అమ్మంటే యిష్టంలేదు. నన్ను తిడుతుంది. బాబ్జీకి అమ్మ నాన్న ఏవైనా తెస్తే దాన్లోని నాకసలే పెట్టదు."

"బాబ్జీ ఎవరు?"

"అమ్మ పిన్ని కొడుకు."

"చూడు పారూ! మీ అమ్మా నువ్వూ ఎంచక్కా మీ చిన్నాన్నదగ్గిర కెళ్ళిపోగూడదూ?"

"మా అమ్మ రాదు."

"ఎందుకనట?"

"మా అమ్మ వాళ్ళందర్తో పోట్లాడేసిందిగా అందుకు."

పక్కవాటాలోంచి 'పారూ' అని కేక వినిపించింది. పార్థుడు మిగిలిన చాక్లెట్ నోట్లో వేసుకుని పరపర నమిలి మూతి ముడుచుకుంటూ అన్నాడు.

"అమ్మపిన్ని పిలుస్తోంది."

"వెళ్ళిరా అప్పుడప్పుడూ వొస్తుండు."

పార్థుడు వెళ్ళిపోయాడు. వాడు వెళ్ళినవేపు చూస్తూ నించున్నాను నాగదిగుమ్మందగ్గిర. డాబామీద వాళ్ళిద్దరూ నావేపూ, పార్థుడివేపూ చూస్తున్నారు. ధైర్యంచేసి నేనింకా అక్కడే నించున్నాను డాబామీద నించున్నాయన నన్ను చేత్తో పిలిచాడు. వెళ్ళేందుకు ముందు సందేహించేను.

"రండి మాస్టారు! మీాముందే మెట్లున్నాయి రండి"

చొక్కా వేసుకుని వెళ్ళాను. నేను మెట్లెక్కుతూండగా, ఆవిడ కిందికి దిగింది. ఆయనొక్కడే డాబామీద ఉన్నాడు. నన్ను సాదరంగా ఆహ్వానించాడు. తనముందున్న పేముకుర్చీచూపించాడు. కూర్చున్నాను. అంతవరకూ మోగుతోన్న ట్రాన్సిస్టర్ని ఆఫ్‌చేసి వో వారగాపెట్టి అన్నాడు;

"నాపేరు ముకుందరావు. పోస్టల్‌డిపార్టుమెంటులో పన్చేస్తున్నాను."

నన్ను నేను పరిచయం చేసుకున్నాను.

"మీకు వీళ్ళందరితో మునుపు పరిచయం వుందా?"

"పార్థుడి నాన్నగారు నాకొంచెం తెలుసు. మేమంతా కలసి చదువుకున్నాం."

అలాచెప్పండి సుందరరావు మాకు దూరపుబంధువు. మొన్న వినారూ విన్నారుగా ఆ కామాక్షమ్మగారు మిమ్మల్ని ఎంతలేసి మాటలన్నారో. మాకు పిల్లలులేరంటే అది మా ఖర్మ! కానీ పిల్లల్ని పిల్లలుగా చూచేగుణం మాకుంది. కడుపుకి కంటేమాత్రం రాక్షసత్వం మంచిదా?"

ముకుందరావు ఇచ్చిన సిగరెట్టు ముట్టించుకుంటూ మౌనం వహించాను.

వీళ్ళందరికథ చెప్పాలని నాకేమాత్రం లేదు. అవుతే మీకూ పార్థుడంటే యిష్టంగనక వాళ్ళకథ చెప్తాను. చెప్పేదాండి.

"చెప్పండి."

"సుందరశివరావు అంతస్తేమిటో మీకూ తెలుసునను కుంటాను వాళ్ళింట్లో బంగారం భోంచేస్తారన్నా అతిశ యోక్తి కాదేమో. అలాంటియింట పుట్టిన పార్థుడు యిక్క డింత హీనంగా బతుకుతూంటే మనసున్న మనిషెవ్వడూ సహించలేడు. అంతమాత్రంచేత వాళ్ళ సొంతవిషయాల్లో జోక్యం కల్పించుకోడమూ మంచిదికాదనుకోండి. కానీ, జాలనేది వుంటుందికదా! ఇది ఆ కామాక్షమ్మగారికి గిట్టదు. ఆవిడమాట శ్రీధరరావుకి వేదవాక్కు."

ఇంకా ఏంచెప్పేవాడో తెలీదుగాని మధ్యలో నేనో ప్రశ్న వేశాను.

"అవునూ. సత్యవతి వాళ్ళ తమామల్తో పోట్లాడి ఒచ్చేసిందిటగా. ఇక్కడికొచ్చి ఈ లేనితనాన్ని భరించడాని కేనా వాళ్ళతో పోట్లాడింది ?"

నాప్రశ్నకి ముకుందరావు నొచ్చుకున్నట్టు గమనిం చాను.

"అందుచేతనే మిమ్మల్ని పిలిచాను రావుగారూ! మీకు పూర్తికథ తెలీదు, మీకేకాదు. చాలామంది కీకిటుకు తెలీదు. సుందరశివరావు పోవడంతో సత్యవతి స్వర్గాన్నే పోగొట్టుకుంది. కాదనను కానీ అతనుపోవడం కామాక్షమ్మ, శ్రీధరరావులకి అన్నివిధాలమంచిది. ఈరోజుల్లో డబ్బుముందు కూతురి సౌభాగ్య, కూతురి కలలవిలువెంత ? డబ్బు మను మనుషులు వీళ్ళద్దరూను. ఎంతకీ తెగించకపోతే చెట్టంత కూతురు ఇంట్లోవుండగా, కట్టుకున్న భార్యనోరుమూసి రెండో

పెళ్ళి చేసుకుంటాడా ? సత్యవతికి అత్తవారింట్లో స్థానంలేదని వాదించాడు. 'తండ్రిమీద భక్తీ గౌరవముంటే నాతో వచ్చెయ్యమని సత్యవతిని అజ్ఞాపించాడు. స్వర్గాన్నే పోగొట్టు కున్న అభాగ్యురాలికి ఈలోకంలోగానీ. ఈ లౌక్యంతో పనే మిటి, తండ్రిమాట కాదనలేక సరేనన్నది. ఇక్కడ్నుంచే అసలైన గారడి ప్రారంభించాడు శ్రీనివాసరావు. కూతుర్ని ఇంటికి తెచ్చుకుంటూ వాళ్ల ఆస్తిలో భాగం అడిగాడు. సత్యవతిని, ఈ పార్థుడ్ని కనిపెట్టుకునుండమని చెప్పి అతను అడిగిన 'భాగం' పంచియిచ్చారు వాళ్లు: ఆ 'భాగం' తాలూకు రాబడితో కులుకుతున్నాడీ శ్రీనివాసరావు. తండ్రిపథకం కూతురికి తెలీకకాదు అత్తిసమాను జీవచ్ఛవంలా బతికే తనకి లౌక్యంతో పనేమిటనే నిర్ణయానికొచ్చేసింది సత్యవతి. దేవుడు తన సౌభాగ్యాన్ని పాడుచేసినందుకు బాధ పడుతుందేగానీ, పార్థుడి భవిష్యత్తు గురించి కించిత్తైనా ఆలో చించదు. అందుకే పార్థుడంటే మాకు జాలి మా చాత నయ్యేదేమీలేదని ఒప్పుకుంటాం. అయితే పొరుగునవున్న వాళ్ళంగనుక పార్థుడి క్షేమాన్ని ఎప్పటికప్పుడు వాళ్ళ చిన్నాన్న వాళ్ళకి తెలీజేసే బాధ్యతని మే తీసుకున్నాం. అందుకే మేమంటే కామాక్షమ్మకీ, శ్రీధరరావుకీ కడుపు మంట."

ఆయన చెప్పిందంతా విని ఆశ్చర్యపోవడం నావంతె యింది. శ్రీనివాసరావుగురించి కథ రాసినశర్మగుర్తొకొచ్చేడు. శ్రీధరరావు కథ అతని రెండోపెళ్ళితో ఆగిపోలేదు. రెండో

భాగం మహా ఘోరంగావుంది. ఈభాగంకూడా శర్మకథగా రాస్తే ఎంత బాగుంటుంది?

ముకుందరావుభార్య కాఫీ తీసుకొచ్చింది.

"తీసుకోండి." అన్నాడు ముకుందరావు. ఆవిడ మరో కుర్చీలో కూర్చుంది. ఆవిడముందు కొంచెం యిబ్బందిగా కాఫీ తాగవలసి వచ్చింది. ముకుందరావుకి మనుషుల్ని చదవడం తెలుసునేమో - ఖచ్చితంగా అనేశాడు.

"మీరు బిడియస్థుల్లా ఉన్నారు"

నవ్వేసి వూరుకున్నాను.

ముకుందరావు భార్య ట్రాన్సిస్టరు చేతుల్లోకి తీసుకున్నది. ట్యూన్ చేసింది.

"మా చిన్నికృష్ణుని మాటలు
మరువరాని తేనె తేటలు
మా పూర్వ పుణ్యాలు మూటలు
మమ్ము దరిచేర్చు తియ్యని బాటలు."

ఉలిక్కిపడ్డాను. సర్దుకోడం కొంచెం కష్టమయ్యింది. వాళ్ళిద్దరిదగ్గిరా సెలవు పుచ్చుకుని గబ గబా డాబా దిగి వచ్చేశాను.

*　　*　　*

పార్థుడివాళ్ళకథ విన్నతర్వాత నాలో గొప్పమార్పు వచ్చేస్తున్నట్టు గమనిస్తూన్నాను. పిచ్చి ఆలోచనలు లక్షల కొద్దీ నన్నుపాడుచేస్తూన్నాయి. ప్రతీదీ వెలితిగా కనుపిస్తోంది.

మనసంతా ఒక పెద్ద గంద్రగోళంగా తయారవుతోంది. ఇక్కడ నాకు తెలిసిన పార్థుడికథ యావత్తూ శ్రీమతికే ఉత్తరంలో రాసేను. ఈ కథతో నా కెలాటి సంబంధమున్నదో మాత్రం స్పష్టంగా వ్రాయలేకపోయేను. ఈ ఉత్తరానికి శ్రీమతి జవాబు వ్రాసింది.

"మీ మనసు నాకు తెలుసు. ప్రతి అనవసరమైన విషయానికీ ఖంగారు పడిపోతుంటారు. ప్రపంచంలో జరిగే దారుణాలన్నీ మీరేం బంధించనక్కర్లేదు. మీర్రాసిన పార్థుళ్ళు ఈ భూమిమీద చాలామంది వున్నారు. అంతమాత్రాన వాళ్ళందర్నీ చూచి బాధపడిపోవడమేమైనా బాగుంటుందా? మీ పెద్దఉత్తరం చదివింతర్వాత నాకూ భయంగావుంది. అలాటి చోట మీరు వొంటరిగా వుండకూడదసలు. శెలవుపెట్టి వొచ్చేయండిఎంచక్కా. ఈ వూళ్ళో సినిమాలు చూడండి. అన్నట్టు యివాళ పేపర్ల కుర్రాడు సినిమాకాగితమొకటి యింట్లో పారేసి వెళ్ళాడు. మీ అభిమాన నటీమణి సోఫియా నటించిన 'ది డిజైర్ అండర్ ది ఎల్మ్స్' ఆడుతోందిట. లోగడ మీరీసినిమా మెచ్చుకున్నారుగదూ. తెలుగు సారంగధర జ్ఞాపకానికొస్తుందని కూడా అన్నారు. ఈ సినిమా నాలుగు రోజులేనట. — అదుగో అప్పుడే పసిగట్టేశారుకదూ — అవును నా మనసు మిమ్మల్ని చూడాలని కోరుతుందన్న మాట. నిజమేగానీ మీరు మెచ్చుకున్నసినిమా మీరు చూడకుండా వుండటం నాకు నచ్చడంలేదుమరి. తర్వాత మీ యిష్టం. ముఖ్యంగా — అనవసరమైన విషయాల్లో జోక్యం చేసుకునిమీరేం సిద్ధార్థులు కానక్కర్లేదని నామనవి. నా

ఆరోగ్యం గురించి మీరేం ఖంగారు పడనవసరంలేదు. మా అన్నయ్యడాక్టరన్న విషయం గుర్తుంచుకోండి. వాడుమిమ్మల్ని యాగీ చేస్తున్నాడు కనక అనవసరంగా ఖంగారుపడకండి. ముందుమీ ఆరోగ్యం జాగ్రత్తగా కాపాడుకోండి. నోలేట్ నైట్సుప్లీజ్."

ఉత్తరం చదివేసి నేనేం బాధపడలేదుగానీ, నన్నెవరూ అర్థంచేసుకోడం లేదేమోననిపించింది. సిద్దార్థుడిలాటి సున్నితమైన హృదయం నాదని నేనేం చెప్పడంలేదు. నాలాగా నా భార్యగూడా పరాయివాళ్ళ అసహాయస్థితికి సానుభూతి చూపడం కాదని దిగులు చెందను. నాచుట్టూ వున్న జనం నాలాగా వుండాలనే సిద్ధాంతాన్ని నేను మెచ్చుకోను. కానీ నామనసు నర్థం చేసుకోలేక సలహాలు చెప్పే వ్యక్తుల్ని నేను హర్షించలేను.

కొంచెం ఆలోచించి చూస్తే నేనీకథలో అనవసరంగా చోటు చేసుకుంటున్నానేమో ననిగూడా అనిపించింది. పార్థుడూ, సత్యవతుల్తో నాకు సంబంధమేంటసలు?

— చాలారోజులు కేవలం ఆఫీసుపనిమీదనే మనసు నిలుపుకోగలిగేను. కానీ, ఓనాటిసాయంత్రం పార్థుడిమూలంగానే మళ్ళా సిద్దార్థుడినయ్యాను. అయితే ఈ నెపం యావత్తూ పార్థుడిమీద తోసేయడమూ పొరపాటే. నా అంతరాంతరాల్లో సుళ్ళు తిరుగుతున్న సానుభూతి నోరు నొక్కేయడం నాచేత కాదు.

ఆ సాయంత్రం పార్థుడు నాగది కొచ్చాడు. వాడి చేతిలో ఆల్బమ్ వుండి, దాన్ని నాకిచ్చేడు.

"చూడండి. మా నాన్నారూ, అమ్మా అందరూ వున్నారు" అన్నాడు.

కుతూహలం కొద్దీ ఆల్బమ్ తెరిచి చూసేను. భయం వేసింది. నిజంగానే భయపడిపోయేను, సుందర శివరావూ, సత్యవతి భార్యా భర్తలు. వాళ్ళఅనురాగానికి హద్దులేవని ఆల్బమ్ చెప్పింది. వాళ్ళఫొటోలు చూస్తూంటే నాకళ్ళల్లో నీళ్ళు తిరిగేయి. ఆల్బమ్ పార్థుడి చేతిలోపెట్టి, రెండు పిప్పరమెంట్లుయిచ్చి నాగదినుంచి పంపేశాను.

అదృష్టవంతుల భాగ్యంతో పోలిక చేసుకున్ననాడు మనసెంత తేలికవుతుందో, దౌర్భాగ్యుల జీవితాల తాలూకు నీడల్ని నాలో వూహించుకుంటే అంత కలత పడిపోతాను. ఈరెండోదే జరిగిందప్పుడు. పార్థుడు తెచ్చిన ఆల్బమ్ నాపెళ్ళి నాటి కొత్తరోజుల్ని గుర్తుచేసింది. సుందర శివరావుని నాతో పోల్చిచూచుకుని తల్లడిల్లిపోయేను. రేపొద్దున్న చావనేది చెప్పి ఒచ్చేయోగం కాదు. బ్రతుక్కీ, చావుకీ మధ్య దూరం చాలా తక్కువ. చావుని తలుచుకుంటూ కూర్చుంటే క్షణ క్షణమూ భయపడవలసిన అవసరం ఎంతైనా వుంటుంది.

సుందర శివరావుకి కలిగిన దుస్థితి నాకూ సంభవిస్తే?

ఆరోజు రాత్రి భోజనం చేయలేదు. ఈ విషయమై శ్రీమతికి ఉత్తరం రాసివుందును. చదివి మరిరెండు సలహాలు చెప్పించుకోగల అవకాశంగోరి మళ్ళా యివ్వడం నచ్చలేదు. అసలీ గదినుంచి దూరంగా యెక్కడికైనా వెళ్ళిపోదామనుకున్నాను. నా చాదస్తం నాలోనే దాచుకోవడం మంచిదని వూరుకున్నాను.

ఏదిఏమైనా పార్థుడితో ఇకమాటాడరాదని నిర్ణయించుకున్నాను.

ఖర్మకాపోతే, ఈ నిర్ణయం నే నెలా ఆచరించగలను? మును పెప్పుడో పార్థుడికి నే నిచ్చిన చనువుని పునస్కరించుకొని వాడు నాకు తరచూ కనుపిస్తూనే వున్నాడు. నా ఆలోచనలన్నీ వాడికి తెలుసాయేమో, నా బలహీనతని కనిపెట్టి నాకు పిచ్చెత్తించగల సత్తా వున్నట్టు భయపెట్టేస్తున్నాడు. వాడిని చూచిన ప్రతిసారీ యేవో దుశ్శంకలు కలుగుతూనే వున్నాయి.

ఓనాడు, నే నాఫీసునుంచి గది కొస్తూన్న వేళ నా వెనగ్గా రిక్షా ఆగివుండటం గమనించేను. వెనక్కితిరిగి చూసేను. పార్థుడు కొత్తబట్టల్తో కళకళలాడుతూ కనిపించేడు. వాడి పక్కన మరో ఖరీదైన మనిషి కూర్చున్నాడు. అతను దర్జాగా సిగరెట్టు కాలుస్తున్నాడు. అతన్ని నేను వెంటనే గుర్తుపట్ట లేదుగానీ, కొంచెం సేపటికి అనగలిగేను.

"లక్ష్మీపతిగదూ!"

అతడు తలూపేడు.

"మా చిన్నాన్న. మా ఊర్నుంచి ఒచ్చేడు" అన్నాడు పార్థుడు.

"ఇక్కడే పనేస్తున్నారా?" అడిగేడు లక్ష్మీపతి.

"కొన్నాళ్ళపాటుండాలి. తర్వాత మన వూరే!"

"మావాడు మీకు బాగా తెలుసులావుందే."

"నా ఫ్రెండు" అన్నా నవ్వుతూ.

పార్థుడు రిక్షాలోంచి గెంతి యింట్లోకి పారిపోయేడు. తర్వాత రెండు రోజులూ పార్థుడు నాకు కనిపించలేదు. వాళ్ల చిన్నాన్నతో వాడిప్పికారూ, సినిమాల సందడిలో నేనెందుకు గుర్తుంటాను?

*  *  *

తెల్లవారుతూండగా ఓ చిత్రమైన కలవచ్చింది. తెల్లగా బొద్దుగా వున్న పాపాయి, అందమైన ఆ పెద్ద కళ్ళల్లో వెలుగు నింపుకుని తన రెండు చేతులూ చాచి నా మీదకి గెంతే సన్నివేశం మనోహరంగా ఉండటంతో నిద్రలోంచి లేచి కూచున్నాను. తర్వాత మళ్ళా నిద్రపట్టనేలేదు. లైటువేసి తల దిండుపై మోచేతులానించి గోడవేపు చూసేను. నగ్నంగా, అందంగా, పోసనవ్వులవల్ల సగానికి మూతపడిన చిలిపికళ్ళతో కేలెండరు పాపాయి కనిపించేడు. నేనూ పక పకా నవ్వేసి తలదిండుని మరింత దగ్గిరిగా లాక్కుని పాట పాడుకున్నాను మెల్లిగా —

"మా చిన్నికృష్ణుని మాటలు
మరువరాని తేనె తేటలు"

నా కళ్ళు నీటితో నిండిపోవడం గమనించేను. పార్థుడి స్థితి గుర్తుకు రావడంతో అలాగే, పిచ్చిగా చూస్తూండి పోయేను.

కలలు నిజమవుతాయన్నది నేనొక్కడ్నీ చెప్పవలసిన మాటకాదు. ఆ ఉదయం ఆఫీసుకెళ్ళి కూర్చున్న తర్వాతవైరు నా చేతి కందింది. లేచి నిలబడి గట్టిగా కేకపెట్టాలనిపించింది.

"అయ్యో! మాస్టారూ! నాకు కొడుకు పుట్టేడండీ!"

సీట్లో నా అవస్థని చూచి ఆ సెక్షను సూపర్నెంటు గబగబా నా దగ్గిరికొచ్చాడు. వైరులాక్కుని చదివేడు. ఆనక నాచేతిని నొక్కుతూ 'కంగ్రాచ్యులేషన్స్' అన్నాడు.

శెలవుపెట్టి అటునుంచి అటే మావూరి బస్సెక్కాను. బస్సు నెమ్మదిగా నడుస్తుందనిపించింది. అప్పుడు నేననుకున్నాను "సొంతంగా ప్రతి మనిషికీ ఒక విమానం వుండి తీరాలని. సాయంత్రానికల్లా మా ఊరి పొలిమేరలు కనుపించేయి. పెద్దబజార్లో బస్సుదిగి ఇన్ని పళ్లూ, పువ్వులూ, స్వీట్సూ వగైరా కొనుక్కుని ఇల్లు చేరుకున్నాను.

మా చెల్లి కొడుకు నన్ను చూస్తూనే గట్టిగాఅరిచేడు—

"మలే! నీకు బావ పుత్తాలు."

ఈ అల్లరి వెధవకి వావి వరసలు తెలీవు. నాకు బావ పుట్టడమేవిటి?

అన్నయ్య వదినతో మెల్లిగా మాట్లాడుతే నాకు వినిపించదనుకున్నాడు కాబోలు — నావసలే పాము చెవులు.

"వీడిని వున్నపళంగా రమ్మని నేనేం వైరివ్వలేదోయ్! మగపిల్లాడు, తల్లీ, బిడ్డా క్షేమంగా ఆవటానిచ్చేను. వూరికే అన్నారా-పుత్రోత్సాహము తండ్రికి నప్పిప్పి! ఏమంటావ్?"

"చాల్లే...మీరూరుకోండి. ప్రతిదానికీ పురాణం చెప్తారు!"

స్నానంచేసి హాస్పిటల్‌కి వెళ్లేను. నిండుగా నవ్వుతూ కళ్ళతో ఆహ్వానించింది శ్రీమతి. ఆకళ్లు తృప్తితో మెరుస్తూ

న్నాయి. ఆమెలో యేదో 'కొత్తదనం' కనుపిస్తోంది. మంచం పక్కగా వెళ్ళి నించున్నాను.

"బాబుని చూడొచ్చావ్?"

"రెండు రోజులుంటారుగా?"

"ఎప్పుడైతే ఏం?"

"ఏం ఫర్లేదు. మంచి నక్షత్రంలోనే పుట్టేడు."

"వూ...ఎవరి పోలికట?"

"చెప్పుకోండి చూద్దాం."

"ఊహూ..."

"చాలావరకు నేనే!!"

"వెరీగుడ్. అందగాడేనన్నమాట. థేంక్యూ సీతా, థేంక్యూ,"

"గట్టిగా అరవకండి. ఎవరైనా వింటారు. అది సరేగానీ, బొత్తిగా అంత లావై పోయారేమిటండీ! ఆ వూరినీళ్లు పళ్ళేదేమిటి? లేక మీ పార్ధుడిగురించి బెంగా."

పార్ధుడు! సీతతో మాటాడేందుకు నోరు పెగల్లేదు. చాలాసేపు సీత ఒక్కరే మాటాడింది. మళ్ళా రేపొస్తానని చెప్పి అక్కడ్నుంచి కదిలొచ్చేశాను. వెళ్ళిపోయేముందు సీత అన్నది.

"బాబుని చూడరూ?"

మనసంతా వికా వికలైపోయింది. ఈ పార్ధుడనబడే ఒకానొక అమాయకపు పిల్లవాడు గుర్తుకొచ్చిన క్షణం నేనెంతో భయపడిపోతున్నాను. భగవంతుడా! నేను చాలా మంచి వాడిని. మంచి వాళ్ళకి నువ్వు కీడు చేయ

వని తెలుసు. నన్ను బతకనివ్వు. మా చిరంజీవికోసం నన్ను బతకనివ్వు.

ఎంతో పరిచయమున్న మావూరి రోడ్డుమీద పరాకుగా నడుస్తున్న నన్ను చూచిన మావూరిజనం నాకు పిచ్చెత్తిందని అనుకున్నా ఆశ్చర్యపడక్కరలేదు.

బాగా రద్దీగా వున్నచోట సన్నెవరో పేరుపెట్టి పిలిచారు. ఆగిపోయి వెనక్కితిరిగి చూశాను. రోడ్డుపక్కన లక్ష్మీపతి సిగరెట్టు కాలుస్తూ నించున్నాడు. అతనివేపు నడిచేను.

"ఎప్పుడొచ్చేరు?"

చెప్పేను.

"ఇక్కడెన్నాళ్లుంటారేమిటి?"

"రేపెళ్ళిపోతున్నాను. ఈనెలాఖర్లోఒచ్చేస్తానుగూడా!"

"రండి! ఓతడవ మాయింటికెళ్ళి ఒద్దాం."

అతనితో వాళ్ళింటికి వెళ్ళాలనిపించింది. అతన్ని అనుసరించాను. పదిగజాల దూరంలో వాళ్ళకారొకటి ఆగివుంది. తలుపుతీసి ఎక్కమన్నాడు. కారెక్కాను. అతను స్టీరింగ్ దగ్గర కూచుని కారుని స్టార్టుచేసి అన్నాడు.

"మా పారుడెలా వున్నాడు?"

"క్షేమం"

అతనింకేం మాట్లాడలేదు. కారు బాణంలా దూసుకుపోయింది. లక్ష్మీపతి వాళ్ళింటిదగ్గి రాగింది (అందమైన ఒక భవన విశేషాన్ని ఇల్లనిచెప్పడం పొరపాటే) లక్ష్మీపతి విసురుగా నడిచేడు. హాల్లోకూచున్న నలుగురూ మమ్మల్ని చూచి

లేచి నుంచున్నారు. గుమ్మం దగ్గరే ఆగిపోయి గోడలవేపు చూస్తుండిపోయేను. లోపల లక్ష్మీపతి మాటలు వినిపించేయి.

“నేను చెప్పేను రావ్‌గారని—వారొచ్చేరు.”

క్షణమాగి నన్ను పేరుతో పిలిచాడు. లోపలికి వెళ్ళాను. పేరు పేరునా ఆ నలుగుర్నీ నాకు పరిచయం చేశాడు. లక్ష్మీపతి తల్లి తండ్రులూ అతని భార్య అతని చెల్లెలూను, నమస్కారం చేసి నించున్నానే తప్ప వాళ్ళ మొహాల్లోకి చూచేంత చొరవ లేకపోయింది. లక్ష్మీపతిభార్య కాఫీలు పట్టుకొచ్చేంతవరకూ హాల్లో మిగిలిపోయిన మామధ్య కేవలం పార్థుడిగురించే సంభాషణ జరిగింది. వాడి ఆరోగ్యం వాడి చదువు, వాడి అల్లరీను. నేనిక్కడ చూచిన నిజాన్ని ఈ మనుష్యులదగ్గర తప్పనిసరిగా దాచవలసిన పరిస్థితి ఎంత దారుణమైనదో నాకొక్కడికే తెలుసుననుకున్నాను. కానీ లక్ష్మీపతి నాన్నగారు నన్ను పసిగట్టిన వైనం విని అల్లాడి పోయాను. ఈ యింటికి నేనెందుకొచ్చానా అని బాధపడి పోయాను. ఆయన అన్నదీ కొద్దిమాటలే—

“నీ మంచితనాన్ని నేనూ మెచ్చుకుంటాను. కానీ రావ్! మా పార్థుడి దినచర్య నాకు తెలుసు. శివుడు లేడు. రోజస్తమానం పుట్టెడు దిగుల్తో నేను బతికివున్నాను పార్థుడి భవిష్యత్తు ఏమని రాసిపెట్టివుందోగాని శివుడు పోవడం సామాన్యమైన విషయంకాదు నాయనా!”

లక్ష్మీపతిభార్య ఆవేళకి కాఫీ పట్టుకురాకపోతే ఆయన మాటల్తో చచ్చి వూరుకుందును.

ఆ యింటినుంచి బయటపడ్డాను. లక్ష్మీపతి నన్ను కారు వేపు తీసుకెడుతూ అన్నాడు.

"రండి! కాసేపు మా తోటలో కూచుని వెళ్ళిపోదాం"

కార్లో కూచున్నతర్వాత చూసేను. మా వెనకసీట్లో లక్ష్మీపతిచెల్లెలు సరోజ వున్నది. ఇబ్బందిలో యిరుక్కుంటున్నానేమోననిపించింది.

రెండుమైళ్ళదూరంలో వాళ్ళతోట వున్నది. ఆతోట దగ్గిర కారాపాడు లక్ష్మీపతి. తోటలోకి అడుగు పెడుతున్నప్పుడు పూర్వం సుందరరావు మా కేర్పాటుచేసిన పార్టీ గుర్తుకొచ్చింది. బరువుగా నడిచాను.

మా కెదురుగా ఒక చిన్న అందమైన డాబా ఒకటున్నది. దానిమీద బంగారు రంగులో 'సత్యనివాస్' అని రాసున్నది, ఆ డాబాని చూస్తూ ఆగిపోయాను. లక్ష్మీపతి ఆగలేదు.

"వదినకోసం అన్నయ్య దీన్ని కట్టించేడు" అన్నది సరోజ.

తలొంచుకున్నాను. ఆ సమయానికి సత్యవతిని ప్రేమించిన మా సత్యం గుర్తుకొచ్చాడు.

"నాకు బాగాగుర్తు! ఆసాయింత్రం వదినపాట పాడింది. ఆమె చాలా చక్కగా పాడుతుంది. మేమంతాగూడా అప్పుడు అక్కడే ఉన్నాం. పాట మధ్యలో అన్నయ్య బాధగా వెనక్కి ఒరిగాడు. వదిన పాట ఆపేసింది. మేమందరం ఆత్రంగా అన్నయ్యదగ్గర చేరాము. మా అందరివేపూ అన్నయ్య భయంగా చూచాడు. అన్నయ్యలా చూడటం అదే మొదటి

సారి. అంతే రావ్ గారూ! మరింక అన్నయ్య లేడు." సరోజ కనుకొలకుల్లో నీళ్లు నిలిచినయి.

"మీరు ఏడుస్తున్నారు" హెచ్చరించాను ఓదార్చే ఓర్పులేక.

సరోజ పమిటచెంగుతో కళ్లొత్తుకుని 'రండి వెడదాం' అన్నది.

మేమిద్దరం డాబాదగ్గిరికెళ్లాము. హాల్లో మేము కుర్చీలో కూర్చున్న లక్ష్మీపతి మా రాకని గమనించలేదు గాబోలు—అతనిచూపు మామిడిచెట్టుమీదుగా అక్కడెక్కడో ఒరిగిపోయిన ఆకాశపుటంచుమీద వున్నది. అక్కడున్న కుర్చీలో మేమిద్దరం కూర్చున్నాం. క్షణం గడిచినతర్వాత లక్ష్మీపతి అన్నాడు:

"చెట్టులాంటి అన్నయ్య పోయాడన్న దిగులుతోపాటు శ్రీధరరావుగారి లౌక్యం మా పార్థుడ్ని మాకు దూరంచేసింది రావ్ గారూ! మీరో సాయం చేయగలరా?"

నే నలితనివేపు చూశాను.

"నా కళ్ళముందు మా పార్థుడు తిరుగుతూంటే వాడిలో మా అన్నయ్యను చూచుకుంటూ కొంత బాధ నైనా మరిచిపోగలం. మాకు వాడు కావాలి. ఆ ఇంటినుంచి మా వదినా, పార్థుడూ ఇద్దరిక్కడి కొచ్చేయాలి. అందు కేదైనా మార్గముంటే చెబ్తారా?"

"నేనేం చెప్పగలను? నిజమే – పార్థు డిక్కడికొస్తే కేవలం బంగారం భోంచేయవచ్చు. పార్థుడి అక్కడి దుస్థితికి పరాయివాడిని నేనూ బాధపడిపోతున్నాను.

కానీ నేను లక్ష్మీపతి! యేమార్గమూ బో
బాగా చీకటి పడుతున్నవేళ మేం ముగ్గురం ఆ తో
బయటపడ్డాం.

* * *

సెలవు పూర్తి కాకుండానే నే నావూరు వెళ్ళేందుకు నిశ్చయించుకున్నాను. ఈ విడ్డూరానికి మావాళ్ళంతా ఆశ్చర్యపోయేరు. వదినమాత్రం నన్ను అడిగిందిగూడాను.

"ఏమిటయ్యా! ఏమిటీవింత నువ్వు మెచ్చుకుంటూన్న నీ సొంతవూరొదిలి వెళ్ళిపోవడమే. పైగా పనసపండులాంటి మీ చిరంజీవితో రెండురోజులు గడుపకుండానే వెళ్ళిపోతావా ఏమిటిచోద్యం. బడాయిపోవద్దు మీ ఆవిడేమైనా అంటే నేచెప్తాను. సరేనా?"

నే నెవరిమాటా వినలేదు. నామనసు వీళ్ళెవరికీ తెలియదు. నాకెందుకో భయంగా వున్నది. ఈ జీవితం, ఈ సంసారం పిల్లలూ బాంధవ్యాలూ, ఇవన్నీ తలచుకోని ఘడియలేదు. సుందరశివరావు, సత్యవతీ, పారుధూ_వీళ్ళల్లో ఎవరు గుర్తుకొచ్చినా బ్రతుకుట్ల వైరాగ్యం కలిగే ప్రమాదం జరగొచ్చని భయంగానూవుంది. పిచ్చెత్తుతూన్నట్లుంది. మొండిగా మావాళ్ళ ముచ్చటనిగూడా గమనించకుండా మావూరొదిలి వెళ్ళిపోయేను.

ఆఫీసుబృందానికీ, నేను సెలవు రద్దుచేసుకోడంలోని తిరకాసు అర్ధమైందికాదు.

బాగా పొద్దుపోయేటంతవరకూ, ఉదయం తొమ్మిది

సారి. అంతే లేచి ఆఫీసుకెళ్ళే కార్యక్రమం వారంరోజులుగాని
కనుకొాలకు
కాలేదు. కావాలనిచెప్పి పార్థుడివిషయం మరచిపోవ
ప్రయత్నించడం ప్రారంభించేను.
ఓర్పుతో

నేనొచ్చిన ఆఫీసుపని చివర్లోపడింది. రెండురోజుల్లో ఊరువదిలి వెళ్ళవలసివుంటుంది. అనగా—దౌర్భాగ్యుడైన పార్థుడిని ఒదిలి నాగూట్లో నేను చేరుకుంటానన్నమాట నావూళ్ళో నాస్నేహితుల్తో సరదాల్తో కలిసిపోతానన్నమాట.

ఆరోజు పెందరాళే యింటికొచ్చాను. నా గదిగుమ్మం ముందు పార్థుడు కూర్చున్నాడు. వాడినిచూస్తూ గతుక్కుమన్నాను. నేను తలుపు తాళంతీస్తూండగా అడిగాడు.

"మీ రస్సలు కనిపించడమే లేదు."

"అవునోయ్ ఆఫీసుపని అలా తగులబడిందిమరి!"

"మా అమ్మకి జ్వరమొచ్చి నయమయింది."

"అలాగా"

"అప్పుడు నేను మావూరెళ్ళిపోదామంటే అమ్మ వద్దింది."

పార్థుడ్ని అర్థంచేసుకున్నాను. చొక్కావిప్పుతూ అన్నాను:

"నేనీమధ్య మనవూరెళ్ళి మీ తాతయ్యవాళ్ళింటికి వెళ్ళివొచ్చేను తెలుసా? మీ చిన్నాన్నా, మీ బామ్మా అందరూ నిన్నడిగామని చెప్పమన్నారు."

"మరి... మరి మా సరోజత్తయ్యా!"

"ఆహా... ఆ అమ్మాయికూడా అడిగింది."

"...మరి మా శాంతపిన్ని"

"ఆవిడగూడాను."

"రంగయ్య?"

"అతనెవరు?"

"మీకు తెలీదా? మా తోటమాలి."

"అవునవును. అతనూ అడిగేనని చెప్పమన్నాడు."

"బలే. అయితే మీరు అందర్నీ చూచారన్నమాట."

వీడికేం చెప్పాలో తోచింది కాదు. కాళ్ళు కడుక్కునేందుకు దొడ్లోకి వెళ్ళేను, బాల్చీతో నీళ్ళు తోడి కాళ్ళు కడుక్కుంటూండగా నా వెనకే నించున్న పార్థుడు అడిగాడు.

"మళ్ళా ఎప్పుడు వెడతారు."

"ఎల్లుండి ఉదయం ఆరుగంటలకి మరింక ఇటు రాను."

"ఎప్పుడూ?"

"వూహు."

తల దువ్వుకుంటూ అద్దంలో పార్థుడిని చూచాను. చొక్కాచివర్తో కళ్ళొత్తుకుంటున్నాడువాడు. జాలికలిగింది. కించిత్తు కోపమూ కలిగింది. అప్పటికప్పుడే నేనోకథ అల్లి చెప్పాను. (ఈతప్పు నాదే. అయినాసరే, వాడికర్థమయ్యేలా కథని తయారుచేసి చాలా వోపిగ్గా చెప్పాను.)

"విను పార్థు! నీలాగే నేనూ చిన్నప్పుడు మా అమ్మమ్మగారింటిలో ఉండేవాడిని. వాళ్లుత్త రాక్షసులు. రోజస్తమానం నన్నూ, మా అమ్మనీ తిట్టేస్తూండేవారు. నాకేమో చెడ్డ బాధగా వుండేది. మా బామ్మగారి వూరెళ్ళి

పోతే మా చిన్నాన్న, మా అత్తయ్యా వాళ్లంతా మంచి వాళ్లు కనుక నన్ను నెత్తిమీద పెట్టుకు తిరుగుతారు. నాకు బోల్డు కొనిపెడతారు."

"నిజం. మా సరోజ త్తయ్య చాలా మంచిదండి."

"నన్ను చెప్పనివ్వ మరి. అయ్యిందా—అప్పుడు మా అమ్మ నడిగాను. మనం మన బామ్మవాళ్ళూరు వెళ్ళిపోదామని. అమ్మ రానంది. అప్పుడు నేనేమి చేసానో తెలుసా ఒక రోజున మా బామ్మవాళ్ళూరి మనిషి కనిపిస్తే అతన్తో పాటు మా బామ్మవాళ్లూరికి పారిపోయాను."

"పారిపోయేరా ? మీ కప్పుడు భయం వేయలేదూ?"

"వూహూ—మన కెందుకూ భయం ? మా బామ్మవాళ్ళూరి మనిషి చాలా పెద్దవాడుగా అంచేత అతన్తో కలిసి వెళ్ళిపోయాను."

"బలె...బలె. బాగుంది. తర్వాత ?"

"తర్వాత ఏమైందంటే నేను పారిపోయిన విషయం మా అమ్మకి తెలిసి, నేను లేకపోతే తనకీ తోచదుగనుక ఆవిడ కూడా మర్నాడు పొద్దునే మా బామ్మగారి వూరొచ్చేసింది. అప్పట్నుంచీ మా అమ్మతో పాటే మా బామ్మగారి దగ్గిరే వుండిపోయింది ఎంచక్కా!"

కథ పూర్తి చేసి వాడి వేపు చూశాను. వాడు కథంతా విని నవ్వు మొహంతో అక్కడ్నుంచి లేచి వెళ్ళిపోయాడు.

ఆ రెండురోజులూ ఆఫీసులో అప్పగింతల్లోనే సరిపోయింది. అప్పగించవలసిన కాగితాలూ, వెంటబెట్టుకెళ్ళ

వల్సిన రిపోర్టులూ అన్నీ ముగించుకుని బయటపడేసరికి రాత్రి పదయింది. రాత్రంతా పెట్టె, బేడా సర్దుకోడంలో మునిగిపోయాను.

తెల్లవారుజామున లేచి స్నానం ముగించి ప్రయాణం తాలూకు హడావిడిలో ఉన్న వేళకి నాగదిలోకి పార్దుడొచ్చేడు వాడిచేతిలో చిన్నసంచి ఒకటున్నది ఒచ్చి అన్నాడు.

"పదండి త్వరగా. మీతోపాటు నేనూపారిపోతున్నాను గదా. మా అమ్మ రేపుదయం వస్తుంది. తొందరగా పోదాం పదండి."

ఉలిక్కిపడ్డాను. ఏమిటి వీడిచొరవ ?

"రాత్రి మా అమ్మతో పోట్లాడాను. నేను పారిపోతానని చెప్పేసేనండి. రండి పోదాం."

"భగవంతుడా! నువ్వు సృష్టించిన 'జైళ్లు' చాలా చిత్రమైనవి. ఈ పసిదొంగ నీ జైలునుంచి పారిపోతున్నాడు. చేయూతనిస్తూన్న నన్ను క్షమించు."

ఆ క్షణంలో మరింకేం తోచలేదు. గబగబా పార్థుడితో బైటకొచ్చి ఆగిపోయేను.

నాముందు కామాక్షమ్మగారూ, సత్యవతీ నించున్నారు. పార్థుడు నావెనుక పిల్లిలా నక్కుతున్నాడు.

కామాక్షమ్మగారు చాలా అన్నారు. ఆడవాళ్ళతో క్రూరత్వం ఎంత అసహ్యంగా వుంటుందో నాకప్పుడు తెలిసింది. పార్థుడి రెక్కపుచ్చుకుని బరబరా లాక్కుంటూ తీసుకెళ్ళారు.

సత్యవతి నావేపు క్షణం చూసింది. ఏంమాటాడింది కాదు. తన రెండు చేతులూ జోడించింది. ఈ అభ్యర్ధన ఎందునిమిత్తమో తెలీదు.

డాబామీద ముకుందరావు దంపతులూ కనిపించేరు. ఇదిగాక నాగదిచుట్టూతా కొందరు మనుషులునించున్నారు.

నా కళ్లు తిరుగుతున్నాయి. కాళ్ళు గబగబా ఒణుకుతున్నాయి. కాళ్ళమీద నించోడం అతికష్టంమీద వోపిక తెచ్చుకుని రెండడుగులు ముందుకు వేశాను.

సత్యవతి వలవలా ఏడుస్తున్నట్టు పసిగట్టాను.

—ఆంధ్ర సచిత్ర వారపత్రిక 1-7-60